కమ్యూనిటీ హాల్ ప్రారంభం



గౌలిపురా: హనుమాన్‌నగర్ ఫేజ్-2లో మొదటి అంతస్తు నూతన కమ్యూనిటీ హాల్‌ను ఆదివారం గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్య లక్ష్మి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షులు ఆలే భాస్కర్ రాజ్, మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర, బీజేపీ నాయకులు ఆదర్శ మహేశ్, బస్తీవాసులు బ్రహ్మం, నరసింహా గౌడ్, జమాల్పూర్ అశోక్, ఆశీష్ దూబే, జె.చంద్రశేఖర్, అనిత పాల్గొన్నారు.

'దేశంలో మోదీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి'



గౌలిపురా: బీజేపీ ప్రభుత్వం అధికారం కోసం దేశ ప్రజల మధ్య మతం చిచ్చుపెడుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఇ.టి.నర్సింహ ఆరోపించారు. సీపీఐ నాలుగో మహాసభ ఆదివారం డివిజన్ పరిధిలోని శ్రీనివాస హైస్కూల్‌లో జి.చంద్రమోహన్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఇ.టి.నర్సింహా మాట్లాడుతూ..దేశంలో మోదీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని, దానికి మొన్న జరిగిన బై ఎన్నికలు కారణమేనని గుర్తు చేశారు. సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఛాయదేవి మాట్లాడుతూ..మోదీ ప్రభుత్వం ప్రశ్నించే హక్కులను కాలరాస్తుందన్నారు. మాజీ ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డాక్టర్ ఎస్.సూర్య ప్రకాశ్, ఎస్.ఆర్.శ్రీనివాస్, రాజు, సూర్యప్రకాశ్, ఎస్.ఆర్.శ్రీనివాస్ రావు, పి.సునిల్ పాల్గొన్నారు. అనంతరం 21 మంది సభ్యులతో కమిటీ వేశారు.సీపీఐ గౌలిపురా డివిజన్ కార్యదర్శిగా గడ్డమీది చంద్రమోహన్‌గౌడ్, సహాయ కార్యదర్శులుగా అటుకుల రాజు, పి.సునీల్, 8 సభ్యులతో కార్యవర్గం, 13 మంది సభ్యులతో కౌన్సిల్‌ను ఏర్పాటు చేశారు.

రోజారమణికి ఎస్వీఆర్ పురస్కారం ప్రదానం



గన్‌ఫౌండ్రీ: భక్త ప్రహ్లాద సినిమాలో ప్రహ్లాదగా నటించిన రోజారమణి తెలుగు ప్రేక్షకులనే కాక జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్నామని అక్కినేని నాటక కళాపరిషత్ వ్యవస్థాపకుడు సారిపల్లి కొండల్‌రావు కొనియాడారు. ఆదివారం ఆదర్శ్‌నగర్‌లోని కళా ప్రాంగణంలో మైహోమ్ అవతార్ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్వీ రంగారావు జయంతిని పురస్కరించుకొని రోజారమణికి ఎస్వీఆర్ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రోజారమణి పాత్రలు ప్రజల హృదయాల్లో నిలిచి ఉంటాయని ప్రశంసించారు. అంతకు ముందు నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో యువకళావాహిని అధ్యక్షులు లంకా లక్ష్మీనారాయణ, సినీ జర్నలిస్ట్ ఎస్వీ రామారావు, సమన్వయకర్త రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జియాగూడలో కరాటే స్టేట్ సెలక్షన్స్



గోల్డ్‌మెడల్ సాధించిన క్రీడాకారులతో ఎం.కె.శ్రీబాలాజీ

జియాగూడ: రాయిపూర్‌లో ఆగస్టు నెల 17 నుంచి 20 వరకు జరిగే 33వ ఏఐకెఏఫ్ నేషనల్ కరాటే డో చాంపియన్‌షిప్ 2025 పోటీల్లో తెలంగాణ నుంచి 27 మంది పలు స్కూళ్లకు చెందిన కరాటే విద్యార్థులు పాల్గొంటున్నట్లు కరాటే డో అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ స్పోర్ట్స్ ప్రధాన కార్యదర్శి ఏఐకెఏఫ్ సహ కోశాధికారి మల్తూంకార్ శ్రీబాలాజీ అన్నారు. ఆదివారం జియాగూడలోని భారత అభ్యుదయ శిక్షా సమితి ఏకె.భవన్‌లో 11వ హైదరాబాద్ డిస్ట్రిక్ట్ కరాటే డో చాంపియన్‌షిప్, స్టేట్ సెలక్షన్స్ జరిగాయి. ఆల్ ఇండియా కరాటే డో ఫెడరేషన్ ఆదేశాల మేరకు కరాటే డో అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో గ్రేటర్‌లోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో 27 మంది కరాటే క్రీడాకారులు గోల్డ్ మెడల్స్, సర్టిఫికెట్లు సాధించారు. ఈ పోటీల్లో జియాగూడకు చెందిన విద్యశ్రీ స్కూల్, సరస్వతి విద్యానికేతన్, శ్రీ శ్లోకా ది స్కూల్, రిలయన్స్ హైటెక్ స్కూల్‌లతో పాటు నగరంలోని వివిధ స్కూల్స్ కరాటే విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించారని తెలిపారు. కరాటే తెలంగాణ స్పోర్ట్స్ అధ్యక్షులు కె.కమల్ ప్రసాద్, ఉపాధ్యక్షులు డాక్టర్ ప్రమోద్ పాల్గొన్నారు.



పూలు, దట్టీలు సమర్పిస్తున్న బీజేపీ నాయకులు జి. హనుమంతరావు



ప్రశాంతంగా మొహర్రం ఊరేగింపు

- డబీర్‌పురా నుంచి చాదర్‌ఘాట్ వరకు కొనసాగిన సామూహిక ఊరేగింపు
- పాతబస్తీలో కొనసాగిన ట్రాఫిక్ ఆంక్షలు

చార్మినార్: పదో మొహర్రం సందర్భంగా ఆదివారం పాతబస్తీలో బీబీ ఆలం సామూహిక ఊరేగింపు నిర్వహించారు. డబీర్‌పురాలోని బీబీ కా ఆలంను లక్ష్మీ అనే ఏనుగుపై పాతబస్తీ ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. దక్షిణ మండల డీసీపీ స్నేహ మేరా ఆధ్వర్యంలో చార్మినార్ కట్టడం వద్ద ఏర్పాటు చేసిన స్వాగత వేదిక పైనుంచి ట్రాఫిక్ డీసీపీ వెంకటేశ్వర్లు బీబీ కా ఆలం ఊరేగింపునకు స్వాగతం పలికారు. దారుషిఫా వద్ద చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ, ఎమ్మెల్సీ రియాజుల్ హసన్ హాఫందీ తదితరులు ఊరేగింపునకు ఘనంగా స్వాగతం పలికారు. ఊరేగింపు కారణంగా మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు పాతబస్తీలో ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగాయి. అక్కడక్కడ ఏర్పాటు చేసిన ఇరాన్ అధ్యక్షుడి ఫొటోలు పాతబస్తీలో కలకలం రేపాయి.

మీరాలంమండిలో..

మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆధ్వర్యంలో మీరాలం మండి వద్ద ఏర్పాటు చేసిన స్వాగత వేదిక పైనుంచి పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్‌తో పాటు గాజుల అంజయ్య పాల్గొన్నారు.

దట్టీలు సమర్పిస్తున్న నిజాం వారసులు..

ఆజాఖానా జొహ్రా వద్ద బీబీ కా ఆలంకు నిజాం కుటుంబీకులు పూలు, దట్టీ సమర్పించారు. ఆజాఖానా జొహ్రా వద్ద దట్టీ సమర్పించడం ఇదే మొదటి సారి. 9వ నిజాం నవాబ్ మీర్ అజ్మత్ అలీ ఖాన్ అజ్మత్ జాహ్ బహదూర్ ఆజా ఖానా జొహ్రా వద్ద బీబీ కా ఆలంకు దట్టీ సమర్పించి నజరానా సమర్పించి కొంత దూరం వరకు బీబీ కా ఆలం ఊరేగింపు వెంట ఉన్నారు.



బీబీకా ఆలంకు పూలు, దట్టీలు సమర్పిస్తున్న గాజుల అంజయ్య

మజ్లిస్ మాతం సందర్భంగా వైద్య సేవలు..

డబీర్‌పురా: మొహర్రం సంతాప దినాల్లో భాగంగా ఆదివారం పదో మొహర్రం సందర్భంగా పాతబస్తీ వీధుల్లో ఏనుగు అంబారీపై సామూహిక ఆలంల ఊరేగింపును అలవా-ఇ-బీకా నుంచి చాదర్‌ఘట్ వరకు నిర్వహించారు. ఈ ఊరేగింపు సందర్భంగా షియా ముస్లింలు మజ్లిస్ మాతం నిర్వహించారు. ఈ సందర్భంగా మజ్లిస్ మాతం నిర్వహిస్తూ స్పృహా కోల్పోయి అస్వస్థకు గురైన వారిని యూపీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య సేవలను నిర్వహించారు.



వైద్య సేవలు నిర్వహిస్తున్న యూపీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది

మొహర్రం అల్లాపై భక్తికి ప్రతీక

గోల్కొండ: మొహర్రం అల్లాపై భక్తికి ప్రతీక అని ఆల్ ఇండియా కీరత్ కమిటీ అధ్యక్షుడు మౌలానా సయ్యద్ మతీన్ అలీషా ఖాద్రీ అన్నారు. మొహర్రం 10వ దినం సందర్భంగా ఆదివారం గోల్కొండ దిలావర్‌నగర్ షానగర్‌లోని అక్తరీ మసీదులో జల్సా షాహదత్ సయ్యద్ నా ఇమామ్ హుస్సేన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇరాన్‌లోని కర్బాలా మైదానంలో నాస్తికులకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడి వీరమరణం పొందిన సయ్యద్ ఇమామ్ హుస్సేన్ త్యాగాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మౌలానా ముఫ్తీ, మిస్ బాహి, ప్రముఖ న్యాయవాది ఎం.ఏ.ముజీబ్, కారీ సయ్యద్ హమర్‌ఉద్దీన్, ముఫ్తీ హాఫీస్, షేక్ తాహేర్ ఆమేరీ తదితరులున్నారు.



మాట్లాడుతున్న సయ్యద్ మతీన్ అలీషా ఖాద్రి

శ్యామాప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న జగదీష్ యాదవ్ తదితరులు



నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ రాకేష్ తదితరులు

జియాగూడ: డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయమని జియాగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు జగదీష్ యాదవ్ అన్నారు. ఆదివారం నవోదయనగర్‌లోని పూలే విగ్రహం వద్ద శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బీజేపీ నాయకులు దర్పల్లి నర్సింహులు, శివకుమార్ యాదవ్, లక్ష్మీ నారాయణ, రమేష్ చొగ్లే, తులసిదాస్, నరేష్, భాస్కర్ గుప్తా, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో..

సుల్తాన్‌బజార్: శ్యామాప్రసాద్ ముఖర్జీ ఆదర్శనీయుడని జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ అన్నారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకొని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు మహేందర్, సీనియర్ నాయకులు లైఫ్‌సింగ్ రాథోడ్, అమర్‌సింగ్, జై తివారి, శంకర్ పాల్గొన్నారు.

సన్మానం

చాంద్రాయణగుట్ట: తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావును ఆదివారం బీజేవైఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఈరంకి విశ్వనాథ్ గౌడ్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు లిక్కి విజేందర్ రెడ్డి, ప్రసాద్, శ్రీకాంత్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు.



పశు వైద్యశాలలో జునోసిస్ డే



పెంపుడు కుక్కలకు టీకాలు వేస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్‌కుమార్



చార్మినార్‌లో కుక్కలకు వ్యాక్సిన్ చేస్తున్న పశు వైద్యులు, సిబ్బంది

విజయనగర్‌కాలనీ: పశుపక్షాదుల నుంచి మనుషులకు వ్యాధులు సంక్రమించకుండా పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా యాంటీ రేబిస్ టీకాలు వేయించాలని విజయనగర్‌కాలనీ శాంతినగర్ పశువైద్య శాల అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.విజయ్ కుమార్ అన్నారు. ఆదివారం జునోసిస్ డేను పురస్కరించుకొని ప్రభుత్వ పశు వైద్యశాలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉచిత యాంటి రేబిస్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన పెంపుడు జంతుల యజమానులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. మాసబ్‌ట్యాంక్, విజయనగర్‌కాలనీ, ఆసిఫ్‌నగర్, కార్వాన్, మెహిదీపట్నం, మురాద్‌నగర్, పరిసర ప్రాంతాల నుంచే కాకుండా పోలీస్, మిలటరీ అధికారుల జాగిలాలకు రేబిస్ టీకాలు వేసినట్లు తెలిపారు. పశు సంవర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ మల్లేశ్వరీ, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ చంద్రావతి, డాక్టర్ యు.రమ్యదేవి, డాక్టర్ కె.విజయలక్ష్మి పాల్గొన్నారు.

చార్మినార్‌లో..

చార్మినార్: రేబిస్ వ్యాధికి చికిత్స లేనందున ముందస్తుగా వ్యాక్సినేషన్ ద్వారా దీనిని నివారించవచ్చునని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ వెటర్నరీ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రేబిస్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. అసిస్టెంట్ డైరెక్టర్ డా.అశోక్ కుమార్, డా.వాసిం,డా. శ్రీకాంత్,కల్యాణ్ లతో పాటు సిబ్బంది పాల్గొని కుక్కలకు యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో యానిమల్ ప్రొటెక్షన్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

డబీర్‌పురా: పాతబస్తీలో నిర్వహించే మొహర్రం ఊరేగింపును చూసేందుకు వచ్చిన ఓ మహిళ అదృశ్యమైన ఘటన డబీర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..చిత్తూరు నందిరెడ్డిగారిపల్లికి చెందిన ఖదీర్ వల్లీ భార్య అమ్మజాన్ (30)తో నానమ్మతో కలిసి ఈ నెల 5న పాతబస్తీలో మొహర్రం పదో రోజు సందర్భంగా నిర్వహించే ఆలంల ఊరేగింపును చూసేందుకు ఆజంపురాకు వచ్చారు. 5న ఉదయం 6 గంటల సమయంలో టీ తాగిన అనంతరం చంచల్‌గూడ గుల్జార్ మసీదు ఫుట్‌పాత్ విశ్రాంతి తీసుకుంటున్నారు. కాగా 7.30 గంటలకు లేచి చూసేసరికి అమ్మజాన్ కనిపించలేదు. ఆందోళన చెందిన ఖదీర్ స్థానిక ప్రాంతాల్లో వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో తన భార్య కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



అమ్మజాన్



గౌలిగూడలో పూజలు చేస్తున్న ఎస్‌ఆర్.లక్ష్మణ్‌రావు



వేడుకల్లో ఎమ్మెల్యే రాజాసింగ్, పాండు యాదవ్

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి



ఉత్సవాల్లో అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ సునావత్ రవి, ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: బిర్లామందిర్, విఠోభ ఆలయం, జియాగూడ రంగనాథస్వామి ఆలయం, గుడిమల్కాపూర్ జామ్‌సింగ్ వెంకటేశ్వర ఆలయాల్లో తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గౌలిగూడ, బేగంబజార్ ప్రాంతాల్లో బజరంగ్ సేనా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఆర్.లక్ష్మణ్‌రావు పూజలు నిర్వహించారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పలు ప్రాంతాల్లో జరిగిన ఉత్సవాల్లో పాల్గొన్నారు. గౌలిగూడ విఠోభ ఆలయంలో రథోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఊరేగింపు చేపట్టారు. బేగంబజార్ కార్పొరేటర్ శంకర్ యాదవ్, బీజేపీ నాయకురాలు మాధవీలత రథోత్సవ వేడుకల్లో పాల్గొని పూజలు చేశారు.



వేడుకల్లో కార్పొరేటర్ శంకర్ యాదవ్

అఫ్జల్‌గంజ్‌లో..

అఫ్జల్‌గంజ్: అఫ్జల్‌గంజ్ పరిసర ప్రాంతాల్లో తొలి ఏకాదశి వేడుకలు పెద్ద ఎత్తున నిర్వహించారు. ఉదయం నుంచే విఠోభ ఆలయంలో పాటు పలు ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. ఆదివారం రాత్రి నిర్వహించిన ఊరేగింపులో అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ సునావత్ రవి, బీఆర్‌ఎస్ నేత ఆనందకుమార్ గౌడ్, బీజేపీ కార్పొరేటర్ శంకర్‌యాదవ్, బీజేపీ నాయకులు ఆల పురుషోత్తమ్‌రావు, పాండు యాదవ్, కిషన్ యాదవ్ పాల్గొని పూజలు చేశారు.

బోనాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీక

గన్‌ఫౌండ్రీ: బోనాల పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో నృత్యమాల నాట్య కళా వెల్ఫేర్ సొసైటీ సిరి ఆర్ట్స్ అకాడమీల సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ బోనాల సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. అనంతరం వివిధ అంశాలపై కళాకారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అదేవిధంగా గురుదేవోభవ పేరిట నాట్య గురువులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞ శర్మ, సంస్థ వ్యవస్థాపకులు ఎం.వీరేష్ యాదవ్, ఏకవీర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

బోనాలను ఘనంగా నిర్వహిస్తాం



సమావేశంలో అమర్‌సింగ్ తదితరులు

గోల్కొండ: కార్వాన్ ఉమ్మడి బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఉమ్మడి బోనాల ఉత్సవాల కమిటీ చైర్మన్ టి.అమర్‌సింగ్ అన్నారు. ఆదివారం కార్వాన్ దర్బార్ మైసమ్మ ఆలయంలో ఉమ్మడి బోనాల ఉత్సవ కమిటీ నిర్వాహణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దర్బార్ మైసమ్మ, మహంకాళి మైసమ్మతో పాటు ఇతర ఆలయాల బోనాల ఉత్సవాలను ఈ నెల 13 నుంచి 21వ తేదీ వరకు జరుగుతాయన్నారు. బోనాల ప్రారంభానికి ముందు సన్నాహక సమావేశం నిర్వహిస్తామని ఆయన తెలిపారు. 13న పూజారి ముల్లే అంజయ్య ఇంటి నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయని 21న రంగం , బలిగంప కార్యక్రమాలతో ఉత్సవాలు ముగిస్తాయన్నారు. మిత్ర కృష్ణ, సునీల్‌యాదవ్, జగత్‌సింగ్, నరేందర్‌సింగ్, జ్ఞానేశ్వర్, అశోక్‌గౌడ్, దేరవ రాజేశ్వర్, దుర్గావతి, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

బోనమెత్తిన కోట



- భక్తిశ్రద్ధలతో కోట నాలుగో బోనం పూజ
- ఆకట్టుకున్న పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు
- వేల సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- పోలీసుల భారీ బందోబస్తు



గోల్కొండ: ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గోల్కొండ ఎల్లమ్మకు నాల్గోవ బోనం పూజ ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే గోల్కొండ కోట, పరిసరాల్లో భక్తుల సందడి నెలకొంది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి అమ్మవారికి సమర్పించేందుకు అందంగా అలంకరించిన తొట్టెల ఊరేగింపులు బోనాల ఉత్సావాలకు హైలెట్‌గా నిలిచాయి. చోటాబజార్, బడా బజార్‌తో పాటు బంజారి దర్వాజా, రిసాల బజార్ తదితర ప్రాంతాల్లోని ప్రధాన రహదారులపై పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఫతేదర్వాజా నుంచి మహిళా భక్తులు ప్రత్యేక దుస్తుల్లో అందరి దృష్టిని ఆకట్టుకున్నారు. శివసత్తుల పూనకాలు, నృత్యాలు బోనాల ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి , బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవర శ్రీనివాస్ బోనాల వేడుకల్లో పాల్గొన్నారు. సౌత్ వెస్ట్‌జోన్ డీసీపీ జి.చంద్రమోహన్ పర్యవేక్షణలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జలమండలి వారు గతంలో కంటే ఎక్కువ సంఖ్యలో ఉచిత తాగునీటి కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆలయ కార్యనిర్వహణ అధికారిణి సి.వసంత ఆధ్వర్యంలో బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ కె.చంటిబాబు ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

లంగర్‌హౌస్‌లో..

లంగర్‌హౌస్: నగరంలోని ప్రధాన ఆలయాల నుంచి తొట్టెలలు లంగర్‌హౌస్‌కి తీసుకువచ్చారు. ఇక్కడి నుంచి తొట్టెలలు, బోనాలు సామూహిక గోల్కొండ కోటకు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా దారి పొడవునా వేదికలు ఏర్పాటు చేసి ఊరేగింపులకు స్వాగతం పలికారు. ఈ ఊరేగింపులో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు, తెలంగాణ ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, గోల్కొండ జిల్లా ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, నాయకులు చీకోటి ప్రవీణ్, ఉదయ్‌కుమార్, ఇంద్రసేనారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు శ్రీకాంత్, బీఆర్‌ఎస్ నాయకుడు జీవన్‌సింగ్ పాల్గొన్నారు.



వేడుకల్లో ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, దేవర శ్రీనివాస్ తదితరులు



లంగర్‌హౌస్ స్వాగత వేదికలో పాల్గొన్న రాంచందర్‌రావు



ఊరేగింపులో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు